



జరిగిన జగన్నాటకం

ఎడమచేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు బోసుకు దళాధిపతి మరణదండన విధించబోతే ఆచార్య వేదాంతం, ద్వీప, పశుపాల కలిసి బోసుని కాపాడారు. ద్వీపాన్ని వదిలి వెళ్ళిపోవాలని ప్రయత్నం విఫలమై జలపతి మరణించాడు. భవిష్యజ్ఞాన గ్రంథంలో చెప్పబడిన మహాబసు బోసే అని పోరాటానికి నాయకుణ్ణి చేశారు. మహాధినేత వామదేవుడు నూటాఇరవై మంది సత్యోద్యమకారులను హతమార్చడంతో శాంతిపోరాటం సాయుధపోరాటంగా మారింది. అడవిలోకి కుడిచేతి వాటం వున్న రణచండి దేవత విగ్రహాల గురించి తెలుసుకున్నాడు మహాబసు. వామదేవుడి గూఢచారి ఉదంతుడు బోసు పోరాటంలో చేరాడు.

# 14

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

“ఉదంతుడు వచ్చి మాతో చేరిన తరువాత కొన్ని రోజుల పాటు ఏ ప్రత్యేకమైన సంఘటనా జరగలేదు. అతని రాకతో మా దళానికి నూతనోత్సాహం వచ్చినట్లైంది. రణచండి విగ్రహాలను కనుక్కున్న తరువాత సవ్యలంకలో ఎడమచేతినే వాడమని ఎందుకు నిర్బంధం చేస్తున్నారో తెలుసుకోడానికి మార్గం సుగమమైందని మాత్రం స్పష్టంగా అర్థం అయ్యింది. నేను పంపించిన వేగులు ఊరూరా తిరిగి కుడి ఎడమ చేతుల గురించి ప్రచారంలో వున్న కథలను, పుక్కిట పురాణాలను, సామతలను సేకరించే పనిలో వున్నారు. ఒక్కొక్కటిగా నా దగ్గరకు వస్తున్నాయి. కొన్ని వినగానే అర్థం అయ్యేవి –

ఉదాహరణకి “కుడి చేతి మాత్ర వైకుంఠయాత్ర” అని చెప్తుంటారు. బహుశా కుడి చేతిని వైద్యంలో వాడటం ప్రమాదకరం అన్న ఉద్దేశ్యంలో దాన్ని కల్పించి వుంటారని మొదట అనిపించింది. తరువాత ఆలోచిస్తే మరో కోణం కనపడింది. కుడి చేతి వాడకాన్ని తగ్గించడం కోసం ఇలా భయపెట్టే విధంగా సామెతను సృష్టించారేమోనని అనుమానం వచ్చింది. కుడి చేతిని వాడటం ద్వారా పతనమైన వాళ్ళ కథలు, తప్పు తెలుసుకోని ఎడమ చేతిని వాడటం ద్వారా మళ్ళీ బాగుపడ్డ కథలు చాలా విన్నాను. వాళ్ళ పురాణాల్లో కూడా ఏవేవో పాత్రలు. కుడి చేతిని వాడే రాక్షసులు, ఎడమ చేతిని వాడే దేవతల గురించి కథలు. కానీ జాగ్రత్తగా గమనిస్తే అన్నింటిలోనూ ప్రత్యేకంగా కుడి ఎడమల ప్రస్తావన, అందులోనూ కుడిని చెడుకి ఎడమని మంచికి జోడించే సందర్భాలన్నీ కృతకంగా కనపడటం మొదలైంది. ఇవన్నీ ఎవరైనా ప్రత్యేకంగా సృష్టించి ప్రజలలో నమ్మకాన్ని కలిగించారా అన్న అనుమానం బలపడసాగింది” చెప్పి ఆపాడు సారధి.

డాక్టర్ నరసింహం ఏ మాత్రం చప్పుడు చెయ్యకుండా సారధి చెప్తున్నదంతా వింటున్నాడు. మరో వైపు ఆయన ఏర్పాటు చేసిన వీడియో కెమెరాలో సారధి చెప్తున్నది రికార్డ్ అవుతోంది.

“కానీ అలా కథలని, సామెతలని పరిశీలించాలన్న ఆలోచన మీకు ఎందుకు వచ్చింది?” అడిగాడు డాక్టర్ నరసింహం.

“నాకెందుకో ఈ కుడి ఎడమల నియమాలన్నీ కల్పితాలనీ, పని కట్టుకోని చేసిన ప్రచారం వల్ల అవి నియమాలుగా, శాసనాలుగా మారాయని అనుమానం వుంది. అది నిర్ధారించుకోడానికే ఆ పని చేయించాను. చెప్పానుగా, నా అనుమానం నిజమే అని చెప్పేందుకు సరిపడా ఆధారాలు దొరుకుతున్నాయి కూడా”

“కానీ, పని కట్టుకోని చేసే ప్రచారాలు సాహిత్యం ద్వారా అంటే పాటలు, కథలు, సామెతల ద్వారా చేసి వుంటారని నీకెందుకు అనిపించింది”

“ఏమో తెలియదు. కానీ ఆ ఆలోచన మాత్రం కరెక్టే అనిపిస్తోంది” అయోమయంగా అన్నాడు సారధి. డాక్టర్ నరసింహం కొద్దిసేపు మౌనంగా వుండి నిట్టూర్చాడు.

“మళ్ళీ గాంధీ, సుభాష్ చంద్ర బోస్ కనిపించలేదా?”

“కనిపించారు. గాంధీ ఒకట్రెండు సార్లు కనిపించారు. ఒకసారి సహాయ నిరాకరణోద్యమం గురించి చెప్పారు. చోరీచోరా సంఘటన తరువాత తాను ఎంత బాధపడ్డారో చెప్పారు. బోస్ మేం చేస్తున్న పోరాటం గురించి అడిగి తెలుసుకున్నారు” చెప్పాడు సారధి.

మళ్ళీ కొద్దిసేపు నరసింహం మాట్లాడలేదు.

“ఏమైనా మీరు చెప్పే కథ చాలా ఇంటరెస్టింగ్ గా వుంది” అన్నాడు చేతిలో వున్న ఫైల్ మూస్తూ.

“మీరు కథ అనడం బాగాలేదు” కొంచెం నిరాశగా అన్నాడు సారధి.

"ఐ యామ్ సారీ... నా ఉద్దేశ్యం అది కాదు. ఎనీ వే... నాకు ఒక విషయం చెప్పండి. ఇదంతా ఎప్పుడు జరుగుతోంది. ఐ మీన్ పగలా, రాత్రి మీరు నిద్రపోయినప్పుడా?"

"ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది. నిజానికి జరగటం కాదు. జరిగినట్లుగా నాకు తెలిసిపోతోంది. నేను అందులో మహాబసుని. మహాబసుకి ఏం జరుగుతోందో అది నాకు తెలుస్తోంది. అతని మనసులో ఆలోచన నా మనసులో కూడా వుంటుంది. అతని అనుభవం నా మెదడులో స్టోర్ అవుతోంది..." ఆవేశంగా చెప్తున్న సారథి ఒక్క క్షణం ఆగాడు. " నేను మీకు అర్థం అయ్యేలా చెప్పగలుగుతున్నానో లేదో నాకు అర్థం కావటంలేదు. ఎక్కడో ఏదో ద్వీపంలో జరుగుతున్న సంఘటనలు నా మెదడులో నిక్షిప్తం అవుతున్నాయి. నా ప్రపంచం, నా ఆఫీస్, నా భార్య, పిల్లలు ఇవన్నీ ఇక్కడ ఇలాగే వున్నాయి. నా మైండ్ కూడా రెండు భాగాలుగా పని చేస్తోంది. ఇట్ ఈజ్ లైక్ పేరలల్ లైవ్స్. పేరలల్ గా జరుగుతున్న రెండు సంఘటనలలో, రెండు సందర్భాలలో, రెండు ప్రపంచాలలో నేను వుంటున్నాను." అంటూ నిట్టూర్చాడు.

"పేరలల్ లైవ్స్... పేరలల్ వరల్డ్స్" అంటూ గొణిగాడు డాక్టర్. "నాకు కొంత సమయం ఇవ్వండి మహాబసు. మీ సమస్యకు పరిష్కారం త్వరలోనే కనుక్కుంటానని నాకు నమ్మకంగా వుంది" అన్నాడాయన.

"ష్యూర్... కాకపోతే.." చెప్పబోయే ఆగిపోయాడు

"చెప్పండి"

"మీరు నన్ను మహాబసు అని సంభోధించారు. మీరు నా రియాలిటీ కన్నా నా రెండో ప్రపంచం మీద ఎక్కువ ధ్యాస పెడుతున్నట్లున్నారు." నిస్సత్తువగా నవ్వాడు సారథి. డాక్టర్ నరసింహం చేతిని ముందుకు చాచి – "ఐ యామ్ సారీ... విల్ టేక్ కేర్" అంటూ క్షమాపణ చెప్పాడు.

డాక్టర్ క్యాబిన్ నుంచి బయటకి వచ్చాడు సారథి. ఆ రోజు అతనితో పాటు ప్రతిసారీ వచ్చే ప్రసాద్ రాలేదు. లిఫ్ట్ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. పైన పదిహేనొవ అంతస్థులో వుంది. దాని కోసం ఆగకుండా మెట్లు దిగి వెళ్ళాలని నిర్ణయించుకోని అటుగా నడిచాడు సారథి. ఆరు అంతస్థులు దిగుతున్నంత సేపు అతని మనసులో ఒకటే ఆలోచన – ద్వీప.

ద్వీప గురించి డాక్టర్ నరసింహంతో కూడా చెప్పలేదు తను. ఆ అమ్మాయి క్రమక్రమంగా దగ్గరవ్వాలన్న ప్రయత్నం చేస్తోంది. మహాబసు ఆ ద్వీపంలో అమ్మాయినే పెళ్ళి చేసుకుంటాడని భవిష్యగ్రంథంలో వుందని ఆ మధ్య ప్రస్తావించింది. తన జాతకంలో ఒక విప్లవవీరుడికి భార్య అవుతుందని కూడా వుందంటూ ఉప్పందించింది. అర్థం అవుతూనే వుంది. కానీ అడుగు ముందుకు వెయ్యడానికి ధైర్యం చాలటంలేదు. తను ఈ ప్రపంచంలో సారథిగా వున్నప్పుడు మహాబసు గురించిన ప్రతి చిన్న విషయం స్పష్టంగా గుర్తు వుంటుంది. కానీ ఆ ప్రపంచంలో మహాబసుగా వున్నప్పుడు తానే సారథి అన్న విషయం తెలియదు. మహాబసుగా తనొక అనామకుడు. ఎక్కడి నుంచి వచ్చాడో, అసలు తను ఎవరో తెలియని అయోమయావస్థలో ఒక అమ్మాయి జీవితంతో ఆడుకోవడం సమంజసం కాదని ఆమెని దూరంగా పెడుతున్నాడు. కానీ అది ఎంతో కాలం సాగేలా కనపడటంలేదు. ద్వీప తనతో ఆ విషయాన్ని చెప్పి, పెళ్ళి చేసుకోమని అడిగేలాగే వుంది.

అది జరిగినప్పుడు చూడచ్చు. అంత కన్నా ముందు ఆలోచించాల్సింది దక్షిణావతం ఆక్రమణ గురించి. అడవుల్లో ఎంతకాలమని వుంటాము? అక్కడికి దగ్గర్లో వున్న దక్షిణావతాన్ని ఆక్రమించి, పూర్తిగా అధీనంలోకి తెచ్చుకోగలితే అక్కడే స్థిరపడి, అక్కడ్నుంచే పోరాటం సాగించవచ్చు. అందుకే ఉగ్రని, ఉదంతుణ్ణి ఆ పని మీదే నియమించాడు తను. వాళ్ళ ప్రయత్నాలు ఎంతదాకా వచ్చాయో తెలియదు. ఉదంతుణ్ణి నమ్మద్దని కొంతమంది, అతను రాజాశ్రయాన్ని వదిలి రావటం మన మంచికేనని మరి కొంతమంది వాదిస్తున్నారు. ఏది ఏమైనా కొంత జాగ్రత్త అవసరం.

ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చేసరికి తేరుకున్నాడు సారధి. అప్పటికే అతను బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ దిగి, సెల్లార్ లోకి రెండు ఫ్లోర్లు దిగాడు. మొదట నవ్వుకున్నాడు. తరువాత ఇబ్బందిపడ్డాడు. వెనక్కి తిరిగి పైకి మెట్లు ఎక్కసాగాడు.

ప్రసాద్ అందుకే డ్రైవింగ్ వద్దని చెప్పాడు. రెండు జీవితాలు గడపటం ఏమో కానీ ఈ మధ్య పరధ్యానం ఎక్కువైపోయిందని అంటున్నాడు వాడు. నిజమే! డాక్టర్ నరసింహాన్ని కలిసినప్పుడు ఈ విషయం చెప్పాలి అనుకుంటూ ఆటోని పిలిచాడు.

<><><>

"దక్షిణావతం మన వశమైనట్లే" వస్తూనే ప్రకటించాడు ఉదంతుడు. వెనకే వచ్చిన ఉగ్ర కూడా ఆనందంగా గుర్రం మీద నుంచి కిందకు దూకు పరుగున మహాబసు దగ్గరకు వచ్చాడు.

"అవును మహాబసు. దక్షిణావతం మొత్తం మన అధీనంలోకి వచ్చేసింది. ఇక మనం ధైర్యంగా అక్కడికి వెళ్ళిపోవచ్చు." సంతోషంగా చెప్పాడతను.

మహాబసు వెంటనే సమాధానం ఇవ్వలేదు. రెండు క్షణాలు ఆలోచించి తన నిర్ణయం ప్రకటించాడు.

"మనం నిశారణ్యంలో వున్నామన్న సంగతి వామదేవుడికి తెలుసు. ఇప్పుడు దక్షిణావతాన్ని మనం స్వాధీనం చేసుకున్నామని కూడా ఈ పాటికి తెలిసే వుంటుంది. అందువల్ల ఈ అరణ్యం నుంచి దక్షిణావతానికి వెళ్ళే దారులన్నింటి మీద అతని నిఘా వుంటుంది. అందువల్ల మనం దక్షిణావతం చేరుకోవడం చాలా ప్రమాదకరం కావచ్చు. నేను రెండు సూచనలు చేస్తాను – ఒకటి ఈ అడవి మార్గంలోనే ఈశాన్య దిశగా ముందుకు వెళ్ళి, దక్షిణావతం ఉత్తర ద్వారం ద్వారా లోపలికి ప్రవేశించడం. రెండు – ఇంకా కొంత కాలం ఇక్కడే ఆగి అవతలి పక్షం వారు అప్రమత్తంగా లేనప్పుడు ఏ రాత్రివేళో అక్కడికి చేరుకోవడం. మీరేమంటారు?" అన్నాడు అక్కడున్నవారందరినీ ఉద్దేశించి. అందరిలో ఉదంతుడే ముందుకు వచ్చి మాట్లాడాడు.

"మహాబసు... మనం దక్షిణావతాన్ని స్వాధీనం చేసుకోని సగం రోజు కూడా కాలేదు. ఈ లాగా ఈ విషయం వామదేవుడికి తెలియడం, అతను మనల్ని చంపాలని పథకం వేసి సైన్యాన్ని పంపడం ఇదంతా సగం రోజులు జరుగుతుందని నేననుకోను. ఇంకా ఎంతకాలమని ఈ నిశారణ్యంలో ఆకులు అలములు తిని బతకమంటావు? ఊరు పిలిస్తోంది. ఇపుడే బయల్దేరి వెళ్ళిపోదాం" అన్నాడు ఆవేశంగా

అనుచరులందరూ "అవును. అవును!" అంటూ కేకలు పెట్టారు. గత కొన్ని రోజులుగా అడవిలో పడి తిరుగుతూ, తినడానికి ఒకరోజు వుండి, ఒకరోజు ఉండక నానా కష్టాలు పడుతున్నవాళ్ళు వాళ్ళు. ఉదంతుడి మాటలు వల్ల వాళ్ళకి దక్షిణావతం వెళ్ళాలన్న కోరిక బలంగా కలిగింది. ఇప్పుడు సాక్షాత్తు మహాబసే వద్దని చెప్పినా వినే పరిస్థితుల్లో లేరు.

"సరే అయితే వెంటనే బయల్దేరండి" అన్నాడు. అనుచరగణమంతా జయజయధ్వానాలు చేశారు. మహాబసు ఉగ్ర, ఆచార్య వేదాంతం కళ్ళతోటే మాట్లాడుకున్నారు. ఇంతమంది అనుచరులతో దక్షిణావతం వైపు వెళ్ళడం ఆత్మహత్యతో సమానమని వాళ్ళందరి అభిప్రాయం. ఇది ఉదంతుడు చేస్తున్న మోసమేమోనన్న అనుమానం కూడా కలిగింది మహాబసుకి. అయినా నిర్ణయం మార్చుకోలేదు.

★★★

పశుపతి ఒక రాత్రివేళ అసహనంగా కదిలాడు. నిద్రలో ఏదో కలవరపరిచే కల. పడుకున్న పక్కమీదే లేచి కూర్చున్నాడు. అప్పటికే కొన్ని రోజులుగా అడవిలో వుంటూ ఏ క్షణాన ఏ ఉపద్రవం వచ్చిపడుతుందో అని అప్రమత్తంగా వున్న అలవాటు వల్లేమో అతని ఈ మధ్య సరిగ్గా నిద్ర పట్టడం లేదు.

ఎండుటాకులు కాళ్ళ కింద పడి నలిగిన శబ్దం అతణ్ణి మరింత చకితుణ్ణి చేసింది. వెంటనే తల తిప్పి చూశాడు. చీకటిలో ఒక నల్లటి ఆకారం కదిలి ముందుకు నడుస్తోంది. రాత్రిపూట ఏదో ఒక అవసరం కోసం ఎవరో ఒకరు అలా లేస్తుండటం మామూలే. కానీ ఈ వ్యక్తి కదలికల్లోనే ఏదో తేడా వుంది. ఎవరూ తనని గమనించకూడదన్న స్పృహ అతను ముందుకు వంగి నడవటం, అటూ ఇటూ చూడటంలో స్పష్టంగా కనిపిస్తోంది. అడుగులు వేసేటప్పుడు అవి చప్పుడు చెయ్యకూడదన్న ప్రయత్నం కూడా తెలుస్తోంది.

అదృష్టవశాత్తు పశుపతి ఒక పొద చాటున వుండటం ఉపకరించింది. చీకట్లో కదులుతున్న వ్యక్తి పశుపతిని చూసే అవకాశమే లేదు. అయితే అదే కారణం వల్ల ఆ వ్యక్తి ఎవరో పశుపతి కూడా గుర్తించలేకపోయాడు. చేతిని చాచి దగ్గర్లో అందుబాటులో వున్న కత్తిని చేతిలోకి తీసుకోని కూర్చున్నవాడు కూర్చున్నట్లే అడుగులో అడుగేసుకుంటూ ఆ వ్యక్తి వెనుకే కదిలాడు.

పశుపతి అనుమానం నిజమే అయ్యింది. ఆ వ్యక్తి అడవి నుంచి దక్షిణావతం దిశగా వెళ్ళే దారిలో ముందుకు సాగుతున్నాడు. అతన్ని అనుసరిస్తూ దాదాపు అడవి చివరిదాకా చేరుకున్నాడు. దట్టమైన ఆ చెట్లను దాటితే ఆ తరువాత కొంతమేర పచ్చికమైదానం వుంది. ఆ వ్యక్తి అడవి దాటితే అతన్ని వెంబడించడం దాదాపు అసాధ్యం. అందుకని ముందుకు ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవలని పశుపతి అనుకున్నాడు.

మరో క్షణం వుంటే దూకేసేవాడే.

సరిగ్గా అప్పుడే చెట్ల అవతల వున్న మైదానం మీదుగా ముందుకు వస్తున్న నల్లటి గుర్రాన్ని గమనించాడు. ఆ గుర్రం మీద వున్నది ఎవరో పోల్చుకోవడం కష్టంగానే వుంది కానీ అతను ఖచ్చితంగా వామదేవుడి సైనికుడో, సైన్యాధికారో అయ్యుంటాడని అతని ఆకారం ద్వారా తెలుస్తోంది.

మరి కొంత సమయం ఎదురుచూసి జరగబోయేదేమిటో తెలుసుకుందామని నిర్ణయంచుకున్నాడు. పైన ఆకాశం వైపు చూశాడు. అతనికి కష్టాన్ని పెంచడానికా అన్నట్లు వెన్నెల కురుస్తున్న చంద్రుణ్ణి నల్లటి మబ్బులు ఆక్రమిస్తూ, చీకట్లని పరుస్తున్నాయి.

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS